సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 24 । మే । 2024



నిగనిగల వెనుక దగా!
మామిడి సీజన్ ఆరంభమైంది. మార్కెట్లో మామిడి పండ్లు నిగారింపుతో కనిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు రసాయనాలతో మగ్గించడం ఆందోళన కలిగిస్తోంది. - 8లో



వైభవంగా పూర్ణాహుతి
రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణు గోపాలస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 8లో



వృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదు..
వృద్ధుల పట్ల నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె.విజయకల్యాణి హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

గజరాజుల గణన ప్రారంభం



ఆర్తాం రిజర్వ్ ఫారెస్టులో గజరాజుల గణనను పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ మండలాల్లో సంచరిస్తున్న గజరాజుల లెక్కింపు ప్రక్రియ మూడురోజుల నిర్వహిస్తామని జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన తెలిపారు. మండలంలోని అర్తాం, కొమరాడ తదితర అటవీ ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది చేపట్టిన గజరాజుల గణన కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల లెక్కింపు పూర్తయితే సంరక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏసీఎం ద్రావణం పిచికారీ



వసతిగృహంలో ఏసీఎం ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

సాలూరు: పట్టణంలోని బంగారమ్మ కాలనీలోని గిరిజన, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణకు ఏసీఎం ద్రావణాన్ని గురువారం పిచికారీ చేశారు. దీనిని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు. వసతి గృహాల్లోని అన్ని గదులు, టాయిలెట్స్‌లో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి ప్రియాంక, ఏఎంఓ సూర్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, సూపర్‌వైజర్ ఎ.వి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మకు 108 చీరలతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో కామాక్షమ్మ

సాలూరు: పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. రెండవ రోజు గురువారం అమ్మవారిని 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. పసుపు, కుంకుమ, పాలతో విశేష అభిషేకాలు జరిపారు.

కాస్త విశ్రాంతి!

- పోలింగ్ తర్వాత వ్యక్తిగత పనుల్లో నాయకులు
- ఎన్నికల కోడ్ దృష్ట్యా కాస్త వెసులబాటు
- పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శనలో నిమగ్నం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 59 నెలలూ ప్రజాసేవకే అంకితం

పోలింగ్ ముగిసింది. ఓట్ల లెక్కింపునకు మరో పది రోజుల(జూన్ 4) సమయం ఉంది. 59 నెలల పాటు ప్రజాసేవలో నిమగ్నమైన పాలకులు.. ఎన్నికల బరిలో దిగాక బిజీ అయ్యారు. సుమారు రెండు నెలల పాటు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజల మధ్యనే గడిపారు. ఎన్నికల కోడ్ వచ్చేనెల 6వ తేదీవరకు అమలులో ఉండడంతో పాలకులకు కాస్త సమయం వెసులబాటైంది. వ్యక్తిగత పనులు, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల సందర్శనలో నిమగ్నమయ్యారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నారు. మరికొందరు పార్టీ నాయకులతో సమావేశాలు, సమీక్షలతో సేదదీరుతున్నారు.

- సాక్షి ప్రతినిధి, విజయనగరం

ప్రజలకు అందుబాటులోనే...

పోలింగ్ ముగిసిన తర్వాత కూడా ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. సాలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిన్నామొన్నటి వరకూ క్షణం తీరికలేకుండా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన ఆయన ప్రస్తుతం స్వగృహంలోనే సేద తీరుతున్నారు.



కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



కేరళ పర్యటనలో పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

కేరళలో విహారం...

పోలింగ్ వరకూ ఎన్నికల ప్రచారంలో తలమునకలైన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఆమె భర్త పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కాస్త విశ్రాంతి తీసుకునేందుకు కేరళను ఎంచుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి మున్నార్, అలెప్పీ ప్రాంతాల్లో వారం రోజుల పాటు సేద తీరి వచ్చారు.

షిర్డీ సందర్శనలో చిన్నశ్రీను...



మజ్జి శ్రీనివాసరావు

ఉమ్మడి విజయనగరం జిల్లాతో శ్రీకాకుళం జిల్లాలోనూ ప్రతి నిత్యం వైఎస్సార్‌సీపీ నాయకులకు అందుబాటులో ఉంటూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పనుల్లో పోలింగ్ వరకూ క్షణం తీరికలేకుండా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) గడిపారు. కాస్త విశ్రాంతి కోసం ఆధ్యాత్మిక పర్యటనను ఎంచుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రస్తుతం షిర్డీ యాత్రలో ఉన్నారు.

ప్రజాసేవలో కోలగట్ల..



విజయనగరంలోని తన నివాసంలో కోలగట్ల వీరభద్రస్వామి

శాసనసభ డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి పోలింగ్ తర్వాత కూడా ఎప్పటిలానే ప్రజలతో మమేకమవుతూనే ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ వంటి అభివృద్ధి పనులతో పాటు విజయనగర రూపురేఖలు మార్చడంలో తాను చేసిన కృషే తన గెలుపునకు బాటలు వేస్తుందనే ధీమాలో కనిపించారు. తన నివాసానికి వస్తున్న పార్టీ నాయకులు, ప్రజలను కలుస్తూ వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ అదీ విశ్రాంతి అన్నట్లుగా కోలగట్ల భావిస్తున్నారు.



భర్త హరిప్రసాద్‌తో ఎమ్మెల్యే కళావతి

విశాఖలోనే కాస్త విశ్రాంతి...

పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోలింగ్ వరకూ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఇప్పుడు విశాఖలో కాస్త విశ్రాంతి తీసుకుంటున్నారు. భర్త హరిప్రసాద్, కుమార్తె సాయివైష్ణవితో అప్పుడప్పుడు సాయంత్రం వేళ కాసేపు బీచ్‌కు వెళ్లివస్తున్నారు.

కుటుంబసభ్యులతో కాసేపు...



అలజంగి జోగారావు

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతి రోజూ ప్రజలతోనే మమేకమైన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారంలోనూ క్షణం తీరికలేకుండా గడిపారు. ఇప్పుడు కాస్త వెసులుబాటు లభించడంతో కుటుంబసభ్యులకు సమయాన్ని కేటాయిస్తున్నారు. చెన్నైలో విద్యాభ్యాసం చేస్తున్న కుమార్తె వద్దకు వెళ్లారు. తర్వాత ఆధ్యాత్మిక ప్రదేశాల పర్యటనలో ఉన్నారు.

అందరి చూపు ఆ తేదీ వైపే...

- జిల్లాలో సర్వత్రా ఎన్నికల ఫలితాల ఉత్కంఠ
- రచ్చబండల వద్ద రసవత్తర చర్చలు
- గెలుపుపై జోరుగా బెట్టింగ్‌లు

పార్వతీపురంటౌన్: ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా ఒకటే మాట. సాధారణ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న అంశంపైనే చర్చ. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన నాటి నుంచి ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండల వద్ద జూన్ 4న విడుదలయ్యే ఎన్నికల ఫలితాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. 2019లో ఫలితాల కోసం 41 రోజులు వేచి చూడాల్సి రాగా ఈసారి 21 రోజుల పాటు ఫలితాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 25న ఆరవ విడత, జూన్ 1న ఏడవదైన చివరి విడత ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

గతానికి ఇప్పటికీ తేడా..

2019 సాధారణ ఎన్నికల ఫలితాలు మే 23న విడుదలైన విషయం అందరికీ తెలిసిందే. 2014 సాధారణ ఎన్నికల ఫలితాలు మే 16న వెల్లడి కాగా, అంతకు ముందు 2009 సాధారణ ఎన్నికల ఫలితాలు కూడా మే 16వ తేదీనే వెల్లడి కావడం గమనార్హం. అయితే, ఈసారి ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదలకానున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించింది. రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేని విధంగా 175 స్థానాలకు 151 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికలు కూడా 2019 నాటి ఫలితాలనే రిపీట్ చేస్తాయన్న సంకేతాలు వస్తున్నాయి. ఎక్కడికక్కడ భారీగా పోలింగ్ జరగడం, వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓటు వేయడం ప్రభుత్వంపై పాజిటివ్ ఓటుకు నిదర్శనమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ సరళి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే ముందు ఐ-ప్యాక్ టీమ్‌ను కలిసిన సమయంలో ఫలితాలపై చేసిన ప్రకటన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించింది. అయితే, ఎన్నికలు, పార్టీ గెలుపుపై ఇన్నాళ్లూ పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్‌లు ఇప్పుడు గ్రామస్థాయికి చేరుకోవడం గమనార్హం. నమ్మకమైన వ్యక్తుల వద్ద డబ్బులు ఉంచి పందేలు కాసుకుంటున్నారు. గ్రామాల్లో బెట్టింగ్‌లు రూ.లక్షల్లో సాగుతున్నట్టు వినికిడి.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం సాధిస్తుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ధీమా వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ విజయం సాధించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. 2019 మే 23న వచ్చిన ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ 151 సీట్లు సాధించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. దేశం మొత్తం మన రాష్ట్రంవైపు చూసేలా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు జేజేలు పలికారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి టీడీపీలో చేర్చుకున్నారని, 2019 మే 23న వచ్చిన ఫలితాల్లో టీడీపీ ఆ 23 సీట్లకే పరిమితమైందన్నారు. ఇది ప్రజాతీర్పు, దైవనిర్ణయంగా పేర్కొన్నారు.

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 59 నెలల పాటు అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనే 2024 ఎన్నికల్లో విజేతగా నిలుపుతుందన్నారు. పాలనలో మంచి జరిగితేనే ఓటెయ్యండి ధైర్యంగా అడిగిన ఘనత మన ముఖ్యమంత్రిదేనన్నారు. మహిళలు అధిక సంఖ్యలో ఓటేయడం వైఎస్సార్‌సీపీకి కలిసివస్తుందన్నారు. వచ్చే నెల 4న వెలువడనున్న ఫలితాల్లో మరలా వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయని చెప్పారు.

25 వరకు దరఖాస్తుల స్వీకరణ

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ఈఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కురుపాం, పార్వతీపురం, అనసభద్ర, వై.ఎస్.వలస, కొటికపెంట, గుమ్మలక్ష్మీపురం ఈఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ/బైపీసీ/హెచ్ఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తిగల గిరిజన, గిరిజనేతర అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- సమీక్ష సమావేశంలో వెల్లడించిన ఎస్పీ ఎం.దీపిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4న జరగనుందని, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ జరిగే జేఎన్‌టీయూ, లెండి ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, చేపట్టాల్సిన భద్రత చర్యలపై దిశానిర్దేశం చేశారు. మూడంచెల భద్రత, రూఫ్ టాప్ బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు తెలియజేసేలా బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్స్ మినహా మిగిలిన వారి మొబైల్స్‌ను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు.

జాబ్ మేళాలో 221 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నవారితో వివిధ కంపెనీల ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 16 కంపెనీలు నిర్వహించిన ఉద్యోగ ఎంపిక ప్రక్రియకు 512 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 221 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు తెలిపారు.

27 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

విజయనగరం రూరల్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని విజయనగరం ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి గురువారం తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుం మీసేవలో గాని, ఆన్‌లైన్‌లో గాని చెల్లించి, సంబంధిత రసీదును తీసుకురావాలన్నారు. పాలిసెట్ పరీక్ష హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణపత్రం, రాబడి, కుల ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పూల్‌బాగ్‌లో ఉన్న ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీవరకు కౌన్సెలింగ్ జరుగుతుందని, ఈ నెల 31 నుంచి జూన్ 04 వరకు ఆప్షన్స్ ఎంపిక, జూన్ 7న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా...

తేదీ	ఏ రోజు ఏ ర్యాంకు వరకు...
27	1 నుంచి 12వేలు
28	12,001 నుంచి 27వేలు
29	27,001 నుంచి 43 వేలు
30	43,001 నుంచి 59 వేలు
31	59,001 నుంచి 75 వేలు
జూన్ 1న	75,001 నుంచి 92 వేలు
2	92,001 నుంచి 1,08,000 వేలు
3	1,08,001 నుంచి అర్హత సాధించిన వారందరికీ

మెరుగైన వైద్య సేవలందించండి



తాడికొండ పీహెచ్‌సీలో వైద్యాధికారులకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

- డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి సూచించారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. వైద్యసేవల తీరును పరిశీలించి వైద్యాధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. గ్రామాల్లో డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలను ఆదేశించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఆమె వెంట వైద్యులు వినోద్, శ్రీధర్, హర్ష, డీఈఎంఓ రెడ్డి, తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు, అభిలాష్, సీహెచ్‌ఓ పద్మ, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

పార్వతీపురం: తిరుపతిలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్‌లెడ్ న్యూట్రిషన్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్, సర్టిఫికేట్ కోర్సు ఇన్ ఎఫ్అండ్‌బీ సర్వీస్ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులన్నారు. బీఎస్సీ హెచ్అండ్ హెచ్ఏ డిగ్రీ కోర్సు ప్రవేశానికి ఇంటర్ పూర్తిచేసి ఉండాలన్నారు. ఆసక్తి గల యువత జూన్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్: 97013 43846, 97004 40604 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

- జిల్లాలో ఇంటింటి సర్వే చేస్తున్న భవిత కేంద్రాల ఐఈఆర్పీలు
- జూన్ 9వ తేదీ వరకు సర్వే
- ఇప్పటి వరకు 111 మంది గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి
- 280 మందికి వివిధ పరికరాల పంపిణీకి చర్యలు



సీతానగరం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం చేపడుతున్న సర్వే

పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు భవిత కేంద్రాల ఐఈఆర్పీ (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్సు పర్సన్)లు సర్వే చేస్తున్నట్టు సహిత విద్యా కోఆర్డినేటర్ పి. భానుమూర్తి గురువారం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మే 1 నుంచి జూన్ 9 వరకు జిల్లాలోని 15 మండలాల్లో 30 మంది ఐఈఆర్పీలు ప్రతీ గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తారన్నారు. ఇంతవరకు జిల్లాలో 111 మందిని గుర్తించినట్టు వెల్లడించారు. అత్యధికంగా పార్వతీపురం మండలంలో 13మందిని, అత్యల్పంగా వీరఘట్టం మండలంలో ఇద్దరిని గుర్తించినట్టు పేర్కొన్నారు. వీరికి ఐఈఆర్పీ సెంటర్‌లో విద్యాబోధనతో పాటు ప్రత్యే అలవెన్సులు అందజేస్తామని చెప్పారు.

పరికరాల కోసం 280 మంది ఎంపిక

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. జిల్లాలోని కురుపాం, పార్వతీపురం(నర్సిపురం), సాలూరు, పాలకొండలలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల నుంచి ఐఈఆర్పీలు దరఖాస్తులు స్వీకరించారు. వారిని ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించగా 280 మందికి వివిధ పరికరాలు అవసరంగా గుర్తించారు. ఎంఆర్ (మెంటల్లీ రీటార్డేషన్), హెచ్ఐ (హియరింగ్ ఇంపాక్ట్), వీఐ (విజువల్ ఇంపాక్ట్), ఆర్థో (ఎముకలకు సంబంధించి) వంటి నాలుగు విభాగాల్లో అవసరమైన పరికరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వారికి త్వరలో వీల్‌చైర్, వినికిడి, చేతి చంక కర్రలు వంటి పరికరాలను అందజేయనున్నారు.



పార్వతీపురంలో దివ్యాంగుల పిల్లల గుర్తింపునకు సర్వే చేస్తున్న ఐఈఆర్పీలు

ప్రత్యేక అలవెన్సులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులను ప్రభుత్వం అందజేస్తోంది. వీటిలో బడికి వచ్చే మానసిక, బుద్ధి మాంద్యం ఉన్న వారికి ఇంటి వద్ద ఉంటున్న వారికి, ఆడపిల్లలకు అలవెన్సులను ఇస్తోంది. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద రూ.200 చొప్పున పది నెలలకు ఒక సారి రూ.2వేలు, బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.200 చొప్పున పది నెలలలకు రూ.2 వేలు అందజేస్తోంది. ఆడ పిల్లలకు ప్రత్యేకంగా గరల్స్ చైల్డ్ అలవెన్స్ కింద రూ.200ను పది నెలలకు రూ.2వేలు, హోం బేస్డ్ అలవెన్సు కింద బడికి రాని ఇంటి వద్ద ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మాత్రమే రూ.200 చొప్పున పది నెలలకు రూ.2వేలు చెల్లిస్తోంది. బడికి వెళ్లే వారికి పాఠశాలలో అందరి విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, బెల్టును అందజేస్తోంది. అమ్మఒడి పథకం కూడా వర్తింపజేస్తోంది.

క్లుప్తంగా

డిప్యూటీ ఈఓ పోస్టుల భర్తీకి పరీక్ష రేపు

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షను ఈ నెల 25వ తేదీన జిల్లాలోని ఆరు కేంద్రా ల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గు రువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రా జాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విజయనగ రం ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భోగాపురం అవంతి ఇంజినీరింగ్ కళాశాల, బొబ్బిలి స్వామి వి వేకానంద ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరం సీతం ఇంజినీరింగ్ కళాశాల, సీతం కళాశాల ప్రాంగణంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష కేంద్రా లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు పరీక్ష జరుగుతుందని.. అభ్య ర్థులు 8.30 గంటలకే హాజరుకావాలని సూచించా రు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

మోసాల బారిన పడొద్దు..

గజపతినగరం: ఫేక్‌కాల్స్ ద్వారా చాలామంది మోసపోతున్నారని, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యు.మహేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న ఓ మహిళకు ఫేక్‌కాల్ ద్వారా బెదిరింపులు వచ్చాయన్నారు. తన ఆధార్ నంబర్‌పై కొన్ని కేసులు నమోదై ఉన్నాయని, అవన్నీ పోవాలంటే కొంత నగదు ముట్టజెప్పాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి చేయడంతో ఆమె రెండు లక్షల రూపాయలు చెల్లించందన్నారు. అయితే అదంతా బోగస్ అని తేలడంతో ఆమె పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశామని చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినా, బ్యాంక్‌ఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలు అడిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బాధితురాలు మాధురి

మక్కువ: మండల కేంద్రంలోని హరిజనకాలనీకి చెందిన ఓ మహిళ బుధవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ (ఒడిశాలో లభిస్తుంది) పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... ఎస్సీ కాలనీకు చెందిన కృష్ణతో మాధురికి 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. కొంతకాలం నుంచి భర్త కృష్ణ మద్యానికి బానిస కావడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన మాధురి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే కాలనీవాసులు మంటలార్పి ఆమెను మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి, అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు



నరసింహుని అవతారంలో శ్రీనివాసుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని ఆలయంలో శ్రీనివాసుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని శ్రీనివాసుడిని నరసింహునిగా అలంకరించి, చందనం పూశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి, నీరజమన్నే, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐదో తరగతిలో ప్రవేశాలు

నెల్లిమర్ల : స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలిక ల సంక్షేమ గురుకుల పాఠశా లలో ఐదో తరగతిలో శు క్రవారం నుంచి ప్రవేశాలు క ల్పిస్తున్నట్లు గురుకులం ప్రి న్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు. గురు వారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... పాఠశాలలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పా రు. ప్రవేశాల కోసం ఇప్పటికే రాత పరీక్ష నిర్వహించామన్నారు. రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యార్థులు ఈ నెల 24 నుంచి 29వ తేదీ లోగా ప్రవేశాలు ఖరారు చేసుకోవాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

నిగనిగల వెనుక దగా..!

- మామిడి కాయలు మగ్గించేందుకు రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ముప్పు
- పట్టించుకోని అధికారులు
- రైఫినింగ్ చాంబర్ల ద్వారా మగ్గ బెట్టేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం



విక్రయానికి సిద్ధంగా కృత్రిమంగా పండించిన మామిడి పండ్లు

కొత్తవలస: పట్టణంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, వగరుగా ఉంటున్నాయి. మామిడికాయలు పక్వానికి రాక ముందే కోసి రసాయనాల వినియోగంతో వాటిని పండ్లగా మార్చేస్తున్నారు. వాస్తవానికి మామిడి కాయలు పక్వానికి వచ్చిన తర్వాత సేంద్రియ పద్ధతుల్లో మగ్గబెడితే సువాసన రావడంతో పాటు రుచిగా కూడా ఉంటాయి. అయితే చాలా మంది మామిడికాయలను రసాయనాలతో మగ్గబెడుతున్నారు. అటువంటి పండ్లు వల్ల జీర్ణక్రియ సమస్యలు, క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రసాయనాల వినియోగం చట్ట ప్రకారం నేరం. కాని అధికారుల ఉదాసీనత వల్ల వ్యాపారులు పేట్రేగిపోతున్నారు. కొన్ని రసాయనాలను నీటిలో కలిపి అందులో మామిడి కాయలను ముంచి పక్కన పెడితే ఒక్క రోజులోనే మంచి రంగు వస్తుంది. ఆకట్టుకునే రంగుతో మామిడిపండ్లు నిగనిగలాడుతుండడంతో ప్రజలు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు.

తగ్గిన మామిడి దిగుబడులు..

జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. ఎకరాకి కనిష్ఠంగా ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ పంటను స్థానికంగా అమ్మడంతో పాటు కోల్‌కత్తా, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ప్రస్తుత ఏడాది గణనీయంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. నాసిరకం కాయలను రసాయనాలతో మగ్గించి స్థానికంగా విక్రయిస్తున్నారు.



రైఫినింగ్ చాంబర్లలో మామిడి పండ్లను మగ్గిస్తున్న దృశ్యం

వ్యత్యాసం గుర్తించడం సులువే..

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన పండ్లను గుర్తిండం సులువే. సహజంగా పండిని మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే తేలిపోతుంది. అలాగే సహజంగా పండిన పండు నుంచి సువాసన వస్తుంది. అలాగే పండు లోపలి భాగం బంగారు రంగులో ఉంటుంది. రసాయనాలతో పండిన పండును కోస్తే లోపలి భాగం లేత తెలుపు రంగులో ఉంటుంది.

రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం..

మామిడి పండ్లను ఎటువంటి విషపూరిత రసాయనాలు వినియోగించకుండా మగ్గబెట్టేందుకు ప్రభుత్వం రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ఈ చాంబార్లు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. రైతులు మాత్రమే కాకుండా వ్యాపారులు కూడా తమ పండ్లును ఈ చాంబర్లలో మగ్గించుకోవచ్చు. చాంబర్లో మొదటి రోజు ఏసీ ద్వారా పండ్లను శీతలీకరణ చేస్తారు. తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్‌ను పంపించి కాయలను మగ్గిస్తారు. ఈ తరహా రైఫిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునేవారికి ఉద్యానవన శాఖ 40 నుంచి 50 శాతం రాయితీ ఇస్తోంది.

ఎన్నో సమస్యలు..



రసాయనాలతో మగ్గించిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా జీర్ణకోశ వ్యాధి, పేగులు దెబ్బతినే అవకాశం, క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. సహజంగా పండిన పండ్లనే తినాలి.

– సీతల్‌వర్మ, పీహెచ్‌సీ వైద్యురాలు, కొత్తవలస

50 శాతం రాయితీ..



రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరీ వ్యక్తులకు 50 శాతం రాయితీతో పథకం వర్తింపజేస్తాం. పూర్తి వివరాలకు సచివాలయాల ఉద్యానవన సహాయకులను సంప్రదించాలి.

– పప్పు పద్మ, కొత్తవలస డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి

విద్యా సదస్సును విజయవంతం చేయండి

- యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గజపతినగరం: విజయనగరం జిల్లా కేఎల్ పురంలో నిర్మిస్తున్న శేషగిరి విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లో ఈనెల 27న 'విద్యారంగంలో పరిణామాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు కోరారు. ఈ మేరకు గజపతినగరం మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ప్రముఖ మేధావి విశపు బాలసుబ్రహ్మణ్యంతో పాటు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఉత్తరాంధ్ర నాయకత్వం హాజరవుతుందన్నారు. సదస్సుకు యూటీఎఫ్ ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులు జీవీ నారాయణ, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, వి.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల నిర్లక్ష్యం తగదు..

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకల్యాణి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకల్యాణి

విజయనగరం క్రైమ్: వృద్ధుల పట్ల నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె. విజయకల్యాణి హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. వృద్ధులు దైవస్వరూపాలని, వారిని ఆదరించాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జీవీబీ జగదీష్ మాట్లాడుతూ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వృద్ధులకు అవసరమైన ప్రత్యేక సదుపాయాల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.త్రినాథ్‌ప్రసాద్ మాట్లాడుతూ, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రామగోపాల్, సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు చదలవాడ ప్రసాద్, చిన్నతల్లి, కట్టమూరి చంద్రశేఖర్, బి.రమేష్, వృద్ధాశ్రమ నిర్వాహకులు, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన



పసుకుడి వద్ద ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న జేసీ శోభిత

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిత మండలంలోని ఇసుక ర్యాంపుల ప్రతిపాదిత స్థలాలు, అక్కడి ఇసుక నిలువలను గురువారం పరిశీలించారు. వంశధార నదీ తీరప్రాంతాలైన లివిరి, పసుకుడి, బిల్లుమడ గ్రామాల సమీపంలోని ఇసుకతిన్నెలను సందర్శించి, ఇసుక నిలువ స్థాయిలను అంచనా వేశారు. జిల్లా భూగర్భ గనుల శాఖ ఎ.డి శ్రీనివాసరావు, డీజీపీఓ బలివాడ సత్యనారాయణల ఆధ్వర్యంలో గతంలో ప్రతిపాదించిన ఇసుక ర్యాంపుల మ్యాప్‌లను గుర్తించారు. ర్యాంపులు మంజూరైతే ఇసుక లభ్యత, రవాణాకు అనుకూలమైన రోడ్డు సౌకర్యాలపై ఆరా తీశారు. పరిశీలనలో భామిని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, బత్తిలి ఎస్సై సీహెచ్.ప్రసాద్, వీఆర్‌ఓలు, సహాయ సర్వేయర్లు ఉన్నారు.

జూలై 14 నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట షిర్డీసాయి ఆలయంలో జూలై 14 నుంచి 21 వరకు ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నటు షిర్డీసాయి ట్రస్ట్ అధినేత బొద్దు విజయరామయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 5.15 గంటలకు కాకడ హారతి నుంచి రాత్రి 10.30 గంటలకు నిర్వహించే పవళింపు సేవ వరకు అనేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అలాగే ప్రతిరోజూ హోమం చేపడతామని తెలిపారు.

పాఠశాల స్థాయి నుంచే క్రీడాస్ఫూర్తి

విజయనగరం అర్బన్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పాఠశాల స్థాయి నుంచే అలవరచుకోవాలని.. అందుకోసం ఆటపాటల్లో పాల్గొనాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఇంట్లో ఆడుకొనే క్రీడలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. చదరంగం, వైకుంఠపాళీ, తదితర ఆటలు ఆడించి, అవగాహన కల్పించారు.అనంతరం వివిధ కళాంశాలపై మెలకువలు వివరించారు.

నాటుబండి కింద పడి బాలుడికి తీవ్ర గాయాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

గజపతినగరం రూరల్: నాటుబండి కింద పడి బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగచోళ్లపెంటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తామాడ అఖిల్ (9) తన తాతయ్య దేవుడుతో పాటు నాటు బండిపై వెళ్తున్నాడు. అకస్మాత్తుగా అఖిల్ జారిపడిపోగా బండి టైరు ఎక్కిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడ్ని గజపతినగరం సీహెచ్‌సీకి తరలించగా.. పరిస్థితి విషమయంగా ఉండడంతో 108 వాహనంలో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

వంగర: మండల పరి .ది తలగాం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీపేట గ్రామానికి చెందిన కోడూరు సత్యంనాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. శివ్వాంలోని ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు లక్ష్మీపేట నుంచి బైక్‌పై వస్తుండగా... గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యంనాయుడును రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వైవీ జనార్దన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన వారణాశి రామేశ్వరి (36) భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో ఏడాది నుంచి బిడ్డలతో కలిసి వేరుగా ఉంటోంది. అయితే ఈ నెల 16న భర్త సూర్యనారాయణ ఇంటికి వచ్చి భార్యతో తగాదా పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె మెడపైన కత్తితో దాడిచేశాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా పారబోత

భామిని: మండలంలోని బత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో సీజ్ చేసిన 375.5 లీటర్ల సారాను గురువారం పారబోసి, క్యాన్‌లను ధ్వంసం చేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ ఎం. చంద్రమౌళి పర్యవేక్షణలో బత్తిలి ఎస్సై సీహెచ్ ప్రసాద్ సారథ్యంలో సారా క్యాన్లు ధ్వంసం చేశారు.

వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు



రామకోనేరు వద్ద సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థ స్నానం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం అనంతరం యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించి, మహా పూర్ణాహుతిని సమర్పించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిలో రామకోనేరు వద్దకు తీసుకువెళ్లి చక్రస్నానం చేయించారు. సాయంత్రం ధ్వజాఅవరోహణ కార్యక్రమాన్ని చేపట్టి ధ్వజస్తంభంపై ఎగుర వేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు కిందకి దించారు. శుక్రవారం స్వామికి పుష్పాలంకరణ కార్యక్రమం కనులపండువగా జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, కిరణ్, వరప్రసాద్, పవన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించాలి


- ఆర్‌ఎంఓ సురేష్‌బాబు



మాట్లాడుతున్న ఆర్‌ఎంఓ సురేష్‌బాబు, డాక్టర్ శివకుమార్

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓ ఎస్.సురేష్‌బాబు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సీహెచ్‌సీ వైద్యులకు నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌పై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని చెప్పారు. సకాలంలో గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయి సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాదరావు, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బర్ల అజయ్‌కుమార్, దంత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. కామేశ్వరావు, ఎన్‌సీడి క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ జి. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంచాలకురాలు చిన్మయిదేవి సూచించారు. స్థానిక మహిళా ప్రాంగణంలో ప్రపంచ రుతుక్రమ దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుతుక్రమ సమయంలో పరిశుభ్రతపై యుక్త వయస్సు బాలికల్లో అవగాహన తప్పనిసరన్నారు. బాలికలు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడ శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి. శాంతకుమారి, సీడీపీఓ డోకుల ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



మాట్లాడుతున్న ఐపీఓ కళింగవర్ధన

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యనభ్యసించి 2024 సంవత్సరంలో ఉద్యోగం సాధించిన 134 మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, తదితరులు గురువారం అభినందించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో ఇండస్ట్రీస్ ప్రమోటింగ్ అధికారి బి.కళింగవర్ధన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యతో త్వరితగతిన ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పుష్పయాగం



శ్రీనివాసునికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: తోటపాలెంలో ఉన్న వేంటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి 44వ బ్రహ్మోత్సవ తిరుక్కల్యాణ, అష్టోత్తర శత కలశ స్నపన మహకలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం రంగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురికి ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యభగవాన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.